సాక్షి రంగారెడ్డి

గురువారం । 19 । సెప్టెంబర్ । 2024



పరిహారం అందించండి

రోడ్డు విస్తరణలో ఆస్తులు కోల్పోయే వారికి పరిహారం అందించాలని ఎమ్మెల్యే శంకర్ హెచ్‌ఎండీఏ కమిషనర్‌ను కోరారు. 8లో▸



వరమా.. కలవరమా?

ఆస్తిపన్నును నెలనెలా వసూలు చేయాలనే ప్రభుత్వ నిర్ణయంపై భిన్నాభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. 8లో▸



'పట్నం' పరిధిలోకి..

మాడ్గుల కార్మిక శాఖ కార్యాలయాన్ని 'పట్నం' పరిధిలోకి వచ్చేలా చూడాలని కార్మికులు డిమాండ్ చేశారు. 8లో▸

న్యూస్‌రీల్

నేటి నుంచి 'స్కూల్ ఎర్త్ క్లబ్ యంగ్ లీడర్స్'

కడ్తాల్: మండల పరిధిలోని అన్మాస్‌పల్లిలోని ఎర్త్ సెంటర్‌లో గురువారం నుంచి స్కూల్ ఎర్త్‌క్లబ్ యంగ్ లీడర్స్ కార్యక్రమం నిర్వహించనున్నట్లు సీజీఆర్ ప్రతినిధి రజనీకాంత్ బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. కౌన్సిల్ ఫర్ గ్రీన్ రెవల్యూషన్ పర్యావరణ సంస్థ–డిపార్ట్‌మెంట్ ఆఫ్ స్కూల్ ఎడ్యుకేషన్ సంయుక్తంగా ఈ కార్యక్రమం నిర్వహిస్తుందని చెప్పారు. ఈ కార్యక్రమానికి నల్గొండ, కరీంనగర్, కామారెడ్డి జిల్లాల ఉపాధ్యాయులు హాజరవుతారని వివరించారు. పర్యావరణ పరిరక్షణకు కృషి చేసే యువత కార్యక్రమంలో పాల్గొంటారన్నారు.

రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్ పోటీలకు రాజు



రాజును అభినందిస్తున్న ఉపాధ్యాయులు

కొందుర్గు: రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్ పోటీలకు మండల పరిధిలోని మట్పూర్ జెడ్పీహెచ్‌ఎస్ పదోతరగతి విద్యార్థి బి.రాజు అర్హత సాధించాడు. ఈ మేరకు బుధవారం విద్యార్థికి పాఠశాల తరపున జీహెచ్‌ఎం గాయత్రిదేవి, వ్యాయామ ఉపాధ్యాయుడు స్వాములు స్పోర్ట్స్‌కిట్ అందజేసి అభినందనలు తెలిపారు. ఈ నెల 12న సరూర్‌నగర్ ఇండోర్ స్టేడియంలో నిర్వహించిన జిల్లా స్థాయి అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్ పోటీల్లో అండర్–18 విభాగంలో రాజు వంద మీటర్ల పరుగు పందెంలో రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైనట్లు చెప్పారు. ఈ నెల 19, 20 తేదీల్లో ఉస్మానియా వర్సిటీ సింథటిక్ గ్రౌండ్స్‌లో నిర్వహించే 10వ తెలంగాణ స్టేట్ సౌత్‌జోన్ అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్ పోటీల్లో విద్యార్థి తలపడనున్నట్లు వారు చెప్పారు.

ఇళ్ల మధ్య సెల్ టవర్ వద్దు



మున్సిపల్ కార్యాలయం ఎదుట నిరసన తెలుపుతున్న కాలనీవాసులు, విద్యార్థులు

అబ్దుల్లాపూర్‌మెట్: ఇళ్ల మధ్య సెల్ టవర్ ఏర్పాటు చేయొద్దని కోరుతూ శివగంగ కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్ వాసులు ఆందోళన చేపట్టారు. పెద్దఅంబర్‌పేట మున్సిపాలిటీ పరిధిలోని 7వ వార్డులో ఇళ్ల మధ్యలో సెల్‌టవర్ ఏర్పాటు పనులు నిర్వహిస్తున్నారు. విషయం తెలుసుకున్న శివగంగ కాలనీ వెల్ఫేర్ అసోయేషన్ వాసులు, స్థానిక సత్యం టెక్నో పాఠశాల విద్యార్థులు బీఎస్పీ నియోజకవర్గ కార్యదర్శి యంజాల ప్రహ్లాద్ ఆధ్వర్యంలో బుధవారం మున్సిపల్ కార్యలయానికి చేరుకున్నారు. పనులను నిలిపివేయాలని కోరుతూ కమిషనర్ రవీందర్‌రెడ్డికి వినతిపత్రం అందజేశారు. అనంతరం వారు మాట్లాడుతూ.. ప్రజల ఆరోగ్యాలను పాడుచేసే సెల్ టవర్ ఏర్పాటు పనులు తక్షణమే నిలిపివేయాలని లేదంటే మున్సిపల్ కార్యాలయం ఎదుట ఆందోళన చేపడతామని హెచ్చరించారు.

పాత బస్తీకి కొత్త సొబగులు

ఓల్డ్‌సిటీపై జీహెచ్‌ఎంసీ ఫోకస్

సాక్షి, సిటీబ్యూరో: పాతబస్తీ పనులపై జీహెచ్‌ఎంసీ ఫోకస్ పెట్టింది. పాతబస్తీ పరిధిలోకొచ్చే చార్మినార్ జోన్‌లో ఇప్పటికే పలు మార్గాల్లో రహదారుల విస్తరణ, ఫ్లై ఓవర్లు, తదితర పనులు త్వరితంగా చేయాలంటూ సంబంధిత అధికారులను ఉన్నతాధికారులు ఉరుకులు పరుగులు పెట్టిస్తున్నారు. పనులు చేపట్టాల్సిన ప్రాంతాల్లో కమిషనర్ ఆమ్రపాలి క్షేత్రస్థాయి పర్యటనలు చేసి అక్కడి పరిస్థితుల్ని తెలుసుకున్నారు. ఇబ్బందులుంటే పరిష్కరించుకోవడంతోపాటు పనుల్ని త్వరితంగా పూర్తిచేయాలని ఆదేశించారు. ఇది ఓవైపు దృశ్యం కాగా, మరోవైపు ఇప్పటికే ఉన్న ఫ్లై ఓవర్లను అందంగా కనిపించేలా థీమాటిక్ థీమ్స్‌తో సుందరంగా తీర్చిదిద్దేందుకు సిద్ధమయ్యారు. ఒవైసీ ఫ్లై ఓవర్, చాంద్రాయణగుట్ట ఫ్లై ఓవర్, కందికల్‌గేట్, ఫలక్‌నుమా ఫ్లై ఓవర్లను చూడటానికి అందంగా ప్రత్యేకంగా తీర్చిదిద్దేందుకు టెండర్లు పిలిచినట్లు అధికారులు తెలిపారు. అంచనా వ్యయం రూ.1.50 కోట్లు కాగా, దాదాపు ఆర్నెళ్లలో పనులు పూర్తికాగలవన్నారు. నగరం మొత్తం అందంగా కనిపించాలన్న ప్రభుత్వ నిర్ణయాని కనుగుణంగా అధికారులు ఈ పనులకు సిద్ధమైనట్లు సమాచారం. బెంగళూర్ నేషనల్ హైవే నుండి శాస్త్రిపురం జంక్షన్ వరకు, చాంద్రాయణ గుట్ట క్రాస్ రోడ్ నుంచి బార్కాస్ రోడ్ వరకు, లక్కీస్టార్ హోటల్ నుంచి హఫీజ్‌బాబానగర్ వరకు, బండ్లగూడ నుంచి ఎర్రకుంట వరకు, తదితర ప్రాంతాల్లో రోడ్ల విస్తరణలతో పాటు ఇతరత్రా ప్రాంతాల్లో పలు పనులకు అధికారులు ఇప్పటికే చర్యలు చేపట్టారు.

స్పష్టతపై ఉత్కంఠ

ఫార్మాసిటీనా..? ఫ్యూచర్ సిటీనా..?

- హైకోర్టును ఆశ్రయించిన బాధితులు
- నివేదిక ఇవ్వాలని ప్రభుత్వాన్ని కోరిన న్యాయస్థానం
- రేపు హైకోర్టుకు రేవంత్‌రెడ్డి సర్కార్ నివేదిక



కుర్మిద్దలో ఫార్మాసిటీకి సేకరించిన భూముల్లో ఏర్పాటు చేసిన టీజీఐఐసీ బోర్డు

యాచారం: ఫార్మాసిటీ ఉంచుతారా..? లేదా అనే దానిపై కాంగ్రెస్ ప్రభుత్వం స్పష్టత ఇవ్వాలని హైకోర్టు కోరింది. ఇందుకు మరికొద్ది గంటల సమయమే ఉండడంతో ప్రజల్లో తీవ్ర ఉత్కంఠ నెలకొంది. ఫార్మాసిటీ పేరుతో సేకరించిన భూముల్లో ప్రభుత్వం ఫ్యూచర్ సిటీ, ఫోర్త్ సిటీ నిర్మిస్తామంటోంది. ఇది ఎలా సాధ్యం.. అసలు నిబంధనలు ఒప్పుకొంటాయా.. అధికారంలోకి రాకముందు కాంగ్రెస్ పెద్దలు ఫార్మాసిటీ రద్దు చేస్తామని రైతులకు హామీ ఇచ్చారు. నేడు అవే భూముల్లో ఫ్యూచర్ సిటీ పేరిట భూ కేటాయింపులు చేస్తున్నారు.. మరోవైపు పట్టా భూములు ఇచ్చిన రైతులు తమ భూములు వెనక్కి ఇవ్వాలని ఒత్తిడి పెంచుతున్నారు. దీంతో పలువురు బాధితులు ప్రాజెక్టుపై ప్రభుత్వం స్పష్టత ఇవ్వాలని కోరుతూ హైకోర్టును ఆశ్రయించారు. ఇందుకు స్పందించిన కోర్టు ఈ నెల 20న స్పష్టమైన నివేదిక ఇవ్వాలని ప్రభుత్వాన్ని కోరింది.

గెలుపోటములు శాసించిన వైనం

గత బీఆర్‌ఎస్ సర్కార్ హయాంలో జిల్లా పరిధిలోని యాచారం, కందుకూరు, కడ్తాల్ మండలాల్లోని 19,333 ఎకరాల్లో ఫార్మాసిటీని నెలకొల్పడానికి నిర్ణయించింది. కేవలం యాచారం, కందుకూరు మండలాల్లో 13,500 ఎకరాల అసైన్డ్, పట్టా భూములను సేకరించింది. అసెంబ్లీ ఎన్నికల ముందు బీఆర్‌ఎస్ అధికారంలోకి వచ్చిన వెంటనే ఫార్మాసిటీకి శంకుస్థాపన చేస్తామని ప్రకటించింది. కాంగ్రెస్ అధికారంలోకి వస్తే రద్దు చేస్తామని.. భూములు సేకరించమని స్పష్టత ఇచ్చింది. దీంతో అయా నియోజకవర్గాల్లో హస్తం గుర్తుపై పోటీ చేసిన మల్‌రెడ్డి రంగారెడ్డి, కసిరెడ్డి నారాయణరెడ్డి గెలుపొందగా... అత్యధిక పట్టణ ప్రాంతమున్న మహేశ్వరం నియోజకవర్గం నుంచి బీఆర్‌ఎస్ అభ్యర్థి సబితారెడ్డి గెలుపొందారు.

కేంద్ర ప్రభుత్వం నుంచి చిక్కులు..?

ఫార్మాసిటీకి కేంద్ర ప్రభుత్వం పర్యావరణ అనుమతులు, జాతీయ పెట్టుబడులు, ప్రోత్సాహక మండలి (నిమ్జ్) హోదా కల్పించడం, ఒక వేళ ఫార్మాసిటీని రద్దు చేస్తే నింబంధనలు ఒప్పుకుంటాయా.. కేంద్ర ప్రభుత్వం నుంచి చిక్కులేమైనా వస్తాయా.. అనే విషయంలో రాష్ట్ర ప్రభుత్వం యోచిస్తున్నట్లు తెలుస్తోంది. రాష్ట్ర సర్కార్ ఇప్పటికే వేల ఎకరాల్లో ఫార్మాసిటీని ఏర్పాటు చేసి ఆ ప్రాంతాన్ని నాశనం చేసే బదులు.. ఫార్మా విలేజ్‌ల పేరుతో రెండు, మూడు చోట్ల ఏర్పాటు చేసేలా కసరత్తు చేస్తోంది. యాచారం–కడ్తాల్ మండలాల పరిధి, అటవీ ప్రాంతం సమీపంలో ఓ మూడు, నాలుగు వేల ఎకరాల్లో ఫార్మాసిటీని ఏర్పాటు చేసేలా సర్కార్ నిర్ణయించినట్లు తెలుస్తోంది. ఫార్మాసిటీకి నిర్ణయించిన 19,333 ఎకరాల్లో సేకరించిన 13,500 ఎకరాలకు రాష్ట్ర ప్లభుత్వం ఇప్పటికే వివిధ సంస్థలకు భూ కేటాయింపులు చేసింది తెలిసిందే.


కడ్తాల్ పరిధిలో భూసేకరణకు ప్లాన్..?

గత బీఆర్‌ఎస్ సర్కార్ ఫార్మాసిటీకి ఇబ్రహీంపట్నం నియోజకవర్గంలోని యాచారం మండల పరిధిలోని నాలుగు రెవెన్యూ గ్రామాల్లో, మహేశ్వరం నియోజకవర్గంలోని కందుకూరు మండల పరిధిలోని మూడు రెవెన్యూ గ్రామాల్లో, కల్వకుర్తి నియోజకవర్గంలోని కడ్తాల్ మండల పరిధిలోని మూడు రెవెన్యూ గ్రామాల్లో 19,333 ఎకరాల అసైన్డ్, పట్టా భూములను సేకరించాలని నిర్ణయించింది తెలిసిందే. ఫార్మాసిటీకి భూసేకరణ ప్రక్రియ 2017 నుంచి ప్రారంభమైంది. అప్పట్లో ఇబ్రహీంపట్నం నుంచి మంచిరెడ్డి కిషన్‌రెడ్డి, మహేశ్వరం నుంచి సబితారెడ్డి, కల్వకుర్తి నియోజకవర్గ నుంచి చల్లా వంశీచంద్‌రెడ్డి కాంగ్రెస్ ఎమ్మెల్యేలుగా ఉన్నారు. మహేశ్వరం, ఇబ్రహీంపట్నం నియోజకవర్గ పరిధిలోనే భూసేకరణ చేశారు. కానీ కల్వకుర్తి నియోజకవర్గంలో అప్పటి ఎమ్మెల్యే చల్లా వంశీచంద్‌రెడ్డి ఫార్మాసిటీకి ఎకరా భూమిని కూడ సేకరించనీయలేదు. కానీ ప్రస్తుతం కడ్తాల్ మండల పరిధిలోని ముద్విన్, కర్కలపహాడ్, కడ్తాల్ రెవెన్యూ గ్రామాల పరిధిలోని గతంలో నిర్ణయించిన సర్వే నంబర్లల్లో దాదాపు 2,500 ఎకరాలకు పైగా అసైన్డ్, పట్టా భూములను సేకరించడానికి టీజీఐఐసీ ప్లాన్ చేస్తున్నట్లు సమాచారం.

రేపే స్పష్టత

ఫార్మాసిటీని ఉంచుతారా.. సేకరించిన భూములను ఇతర సంస్థలకు అప్పగిస్తారా అనే విషయమై శుక్రవారం రాష్ట్ర ప్రభుత్వం లిఖితపూర్వకంగా హైకోర్టుకు నివేదించనుంది. ముఖ్యమంత్రి పగ్గాలు చేపట్టిన రేవంత్‌రెడ్డి ఓ మారు ఫార్మాసిటీ రద్దు చేస్తామని.. మరో మారు ఉంచుతామని.. అభివృద్ధి పనులు చేపట్టాలని అధికారులను ఆదేశిస్తూ ప్రకటనలు వెలువడ్డాయి. దీంతో రైతుల్లో తీవ్ర ఆందోళన నెలకొంది. తాజాగా పరిహారం డబ్బులు తీసుకోవడంలో మీకున్న అభ్యంతరమేమిటో ఈ నెల 27న స్వయంగా కోర్టుకు వచ్చి చెప్పాలని హైకోర్టు రైతులను కోరింది.

రైతుల ఆర్థిక ప్రగతికి కృషి



ఈనెల 20న ఫార్మాసిటీ ప్రాజెక్టుపై నివేదిక హైకోర్టు ప్రభుత్వాన్ని కోరింది. ఉన్నతాధికారులు లిఖితపూర్వక నివేదిక అందజేస్తారు. నివేదికపై తమకు సమాచారం ఉండదు. భూములు కోల్పోయిన రైతులకు న్యాయం చేస్తాం. ఇప్పటికే మంచి పరిహారం అందజేశాం. మీరాఖాన్‌పేట మెగా హెచ్‌ఎండీఏ వెంచర్‌లో సర్టిఫికెట్లు ఇచ్చిన రైతులకు త్వరలో ఇళ్ల స్థలాలు చూపుతాం. రైతుల ఆర్థిక ప్రగతికి కృషి చేస్తున్నాం.

– అనంత్‌రెడ్డి, ఆర్డీఓ, ఇబ్రహీంపట్నం



షాద్‌నగర్: డబుల్ బెడ్‌రూం ఇళ్లను పరిశీలిస్తున్న కలెక్టర్ శశాంక, ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్

త్వరలో ఇళ్ల పంపిణీ

- కలెక్టర్ శశాంక
- షాద్‌నగర్ నియోజకవర్గంలో ఎమ్మెల్యేతో కలిసి డబుల్ బెడ్రూం ఇళ్లను పరిశీలించిన కలెక్టర్

షాద్‌నగర్/నందిగామ: అర్హులైన నిరుపేదలకు డబుల్ బెడ్రూం ఇళ్లను వీలైనంత త్వరగా పంపిణీ చేస్తామని కలెక్టర్ శశాంక అన్నారు. బుధవారం ఆయన ఎమ్మెల్యే, ప్రభుత్వరంగ సంస్థల చైర్మన్ వీర్లపల్లి శంకర్‌తో కలిసి షాద్‌నగర్‌పట్టణ శివారు, నందిగామ, కొత్తూరు పరిధిలోని నిర్మించిన డబుల్ బెడ్రూం ఇళ్లను పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. అసంపూర్తిగా ఉన్న నిర్మాణాలను త్వరితగతిన పూర్తి చేసేందుకు చర్యలు చేపట్టామన్నారు. ఇక్క నివసించే ప్రజలకు విద్యుత్, తాగునీరు తదితర మౌలిక వసతులు కల్పిస్తామన్నారు. ఇప్పటికే ఎమ్మెల్యే ఇదే విషయంలో చర్చించారని.. అర్హులైన వారికి త్వరలో ఇళ్లు కేటాయించేలా అధికారులు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. అనంతరం ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ మాట్లాడుతూ.. డబుల్ బెడ్ రూం ఇళ్లు కొన్ని అసంపూర్తిగా ఉన్నాయని వాటిని వెంటనే పూర్తి చేసేందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టిందని అన్నారు. అర్హులైన లబ్ధిదారులకు పార్టీలకు, రాజకీయాలకు అతీతంగా ఇళ్లను పంపిణీ చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్‌డీఓ వెంకట మాధవరావు, మున్సిపల్ చైర్మన్లు నరేందర్, లావణ్య, కమిషనర్ వెంకన్న, తహసీల్దార్లు పార్థసారధి, రాజేశ్వర్, ఎంపీడీఓ సుమతి, నాయకులు బాబర్‌ఖాన్, హరినాథ్ రెడ్డి, సుదర్శన్ గౌడ్ వెంకట్‌రాంరెడ్డి, జంగ నర్సింహాయాదవ్, చెన్నయ్య, రఘు, చెంది తిరుపతిరెడ్డి, మహ్మద్ ఇబ్రహీం, సయ్యద్ ఖదీర్, సీతారాం, సుదర్శన్, కొమ్ము కృష్ణ, చంద్రపాల్‌రెడ్డి, దేపల్లి కుమార్‌గౌడ్. కావలి కృష్ణ, చిందం నర్సింహ, సీతారాం, చించేటి కృష్ణముబారక్ తదితరులు పాల్గొన్నారు.

చదవడం, రాయడం తప్పనిసరి

- జిల్లా విద్యాధికారి సుశీంధర్‌రావు
- శంకర్‌పల్లిలోని కేజీబీవీ, ఆదర్శ పాఠశాల్లో ఆకస్మిక తనిఖీ



శంకర్‌పల్లి కేజీబీవీ విద్యార్థులతో మాట్లాడుతున్న డీఈఓ సుశీంధర్‌రావు

శంకర్‌పల్లి: ప్రతీ విద్యార్థికి చదవడం, రాయడం తప్పక రావాలని జిల్లా విద్యాధికారి సుశీంధర్‌రావు అన్నారు. బుధవారం ఆయన మండల పరిధిలోని కేజీబీవీ, ఆదర్శ పాఠశాలలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పాఠశాల విద్యార్థులతో మాట్లాడారు. కేజీబీవీలో 6వ తరగతి విద్యార్థినులకు బోర్డుపై ఇచ్చిన గణిత సమస్యను సాధించలేకపోయారు. దీంతో ఆయన ఉపాధ్యాయులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. విద్యార్థులకు గుణాత్మక విద్యనందించాలని ఆదేశించారు. సమస్యలుంటే తమ దృష్టికి తీసుకురావాలన్నారు. మెనూ ప్రకారం భోజనం వడ్డిస్తున్నారా లేదా అని విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్యబోధన అందుతుందని తల్లిదండ్రులు భావించేలా ప్రతీ విద్యార్థిపై ప్రత్యేక శ్రద్ధ వహించాలన్నారు. అనంతరం ఆదర్శ పాఠశాల ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులతో సమావేశం నిర్వహించి పాఠశాల సమస్యలను తెలుసుకున్నారు. ఈ విద్యా సంవత్సరంలో 10వ తరగతితోపాటుగా ఇంటర్మీడియట్‌లో ఉత్తమ ఫలితాలు తీసుకువచ్చేందుకు కృషి చేయాలని అదేశించారు. ఈ కార్యక్రమంలో ఎంఈఓ అక్రమ్, కేజీబీవీ ప్రిన్సిపాల్ మధురవేణి, తదితరులున్నారు.



టాస్క్ సీఓఓగా బాధ్యతలు స్వీకరిస్తున్న సుంకిరెడ్డి రాఘవేందర్‌రెడ్డి

ఉపాధి కల్పనే ధ్యేయం

- సుంకిరెడ్డి రాఘవేందర్‌రెడ్డి
- టాస్క్ సీఓఓగా బాధ్యతల స్వీకరణ

ఆమనగల్లు: తెలంగాణ అకాడమీ ఫర్ స్కిల్ అండ్ నాలెడ్జ్ (టాస్క్) చీఫ్ ఆపరేటింగ్ ఆఫీసర్‌గా కల్వకుర్తి నియోజకవర్గ కాంగ్రెస్ నాయకుడు, ఐక్యత ఫౌండేషన్ చైర్మన్ సుంకిరెడ్డి రాఘవేందర్‌రెడ్డి బుధవారం బాధ్యతలు స్వీకరించారు. వృత్తి నైపుణ్యం ఉన్న యువతను గుర్తించి వారికి ఉపాధి కల్పించడమే తమ లక్ష్యమన్నారు. హైదరాబాద్‌లోని టాస్క్ కార్యాలయంలో సీఈఓ శ్రీకాంత్‌సిన్హా ఆధ్వర్యంలో చీఫ్ ఆపరేటింగ్ ఆఫీసర్‌గా సుంకిరెడ్డి రాఘవేందర్ రెడ్డి బాధ్యతల స్వీకరణ అనంతరం ఆయన మాట్లాడారు.

నైపుణ్యం పెంచడమే లక్ష్యం

ఇంజినీరింగ్, డిగ్రీ, ఎంబీఏ, ఎంసీఏ, పాలిటెక్నిక్ తదితర విద్యార్థుల కోసం ఆయా కళాశాలలను కార్పొరేట్ సంస్థలతో అనుసంధానం చేస్తూ నైపుణ్యం పెంచుకోవడమే ముఖ్య ఉద్దేశ్యమన్నారు. విద్యార్థుల్లో స్కిల్స్ పెంచి ప్రస్తుత అవసరాలకు అనుగుణంగా శిక్షణ ఇచ్చి ఉద్యోగావకాశాలు కల్పిస్తామన్నారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, ఐటీ శాఖామంత్రి శ్రీధర్‌బాబు ఆధ్వర్యంలో టాస్క్ నిర్దేశించిన లక్ష్యాలను పూర్తి చేయిస్తామన్నారు. అనంతరం రాఘవేందర్‌రెడ్డిని కల్వకుర్తి నియోజకవర్గ కాంగ్రెస్ నాయకులు, ఐక్యత ఫౌండేషన్ సభ్యులు ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఐక్యత ఫౌండేషన్ గౌరవ అధ్యక్షుడు సుంకిరెడ్డి కృష్ణారెడ్డి, నాయకులు సురేశ్‌రెడ్డి, రాములు, శ్రీరాములు, కసిరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి, చంద్రశేఖర్, జైపాల్‌రెడ్డి, అభినవ్ రెడ్డి, రాజు, కుమార్‌గౌడ్, అంజ్యనాయక్, మల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

అభ్యంతరాలుంటే చెప్పండి

- 28న ఫైనల్ ఓటరు జాబితా
- జిల్లా అదనపు కలెక్టర్ ప్రతిమాసింగ్



రాజకీయ పార్టీల నాయకులతో సమావేశమైన అదనపు కలెక్టర్ ప్రతిమాసింగ్

ఇబ్రహీంపట్నం రూరల్: గ్రామ పంచాయతీ ఓటర్ల ముసాయిదా జాబితాపై అభ్యంతరాలుంటే చెప్పాలని అదనపు కలెక్టర్ ప్రతిమాసింగ్ కోరారు. బుధవారం కలెక్టరేట్ కార్యాలయంలోని సమావేశ మందిరంలో ఆమె వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ.. ఈ నెల 13న ప్రచురించిన ఓటరు ముసాయిదా జాబితాపై ఈ నెల 21 వరకు అభ్యంతరాలు స్వీకరిస్తామన్నారు. 19న మండల స్థాయి రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశం నిర్వహించాలని సూచించారు. 26న అభ్యంతరాలను డిస్పోజ్ చేసి 28న ఫైనల్ జాబితా ప్రచురిస్తామని చెప్పారు. గ్రామాల్లో నివసించని వారు, వివాహం చేసుకుని వెళ్లిన వారు, చనిపోయిన వారి పేర్లను జాబితా నుంచి తొలగించాలన్నారు. ఒకే కుటుంబంలో ఉండి వేర్వేరు వార్డుల్లో పేర్లుంటే వారిని ఒకే వార్డులో ఉండేలా చూసి జాబితా తయారు చేయాలని రాజకీయ పార్టీల ప్రతినిధులు కోరారు. ఇందుకు స్పందించిన ప్రతిమాసింగ్ పంచాయతీల్లో ఇంటింటి సర్వే చేసి మీరు సూచించిన అంశాలను పరిగణలోకి తీసుకుని ఫైనల్ జాబితా రూపొందిస్తామన్నారు. ఈ సమావేశంలో జెడ్పీ సీఈఓ కృష్ణారెడ్డి, జిల్లా పంచాయతీ అధికారి సురేశ్ మోహన్, బీజేపీ నుంచి బొక్క నర్సింహారెడ్డి, బోసుపల్లి ప్రతాప్, దొండ రమణారెడ్డి, బీఆర్‌ఎస్ నుంచి నిట్టు జగదీష్, సీపీఎం నుంచి పగడాల యాదయ్య, సామేలు తదితరులు పాల్గొన్నారు.

ఎన్‌ఎండీసీకి రాజభాషా కీర్తి అవార్డు

సాక్షి, సిటీబ్యూరో: ప్రభుత్వ రంగ సంస్థ ఎన్‌ఎండీసీ లిమిటెడ్‌కి 2023–2024 సంవత్సరానికి గాను సీ రీజియన్ అండర్‌టేకింగ్ విభాగంలో ప్రతిష్టాత్మకమైన 'రాజభాషా కీర్తి అవార్డు' లభించింది. న్యూఢిల్లీలో అధికార భాషా విభాగం, హోం వ్యవహారాల మంత్రిత్వ శాఖ నిర్వహించిన హిందీ దివస్ రాజభాషా సమ్మేళనంలో ఈ అవార్డును ప్రదానం చేశారు. ఎన్‌ఎండీసీ అధికార భాషా విధానాన్ని సమర్థవంతంగా అమలు చేసినందుకు రెండవ బహుమతితో గుర్తింపు పొందింది. ఎన్‌ఎండీసీ చీఫ్ జనరల్ మేనేజర్ (పర్సనల్ – అడ్మినిస్ట్రేషన్) ప్రియదర్శిని హోం వ్యవహారాల రాష్ట్ర మంత్రి నిత్యానంద రాయ్, రాజ్యసభ డిప్యూటీ చైర్మన్ హరివంశ్ నారాయణ్ సింగ్, రాజ్యసభ సభ్యుడు సుధాంశు త్రివేది సమక్షంలో ఈ అవార్డును అందుకున్నారు.

హాస్టల్‌లో ఉండటం ఇష్టం లేక..

- భవనం పైనుంచి దూకి ఇంటర్ విద్యార్థి ఆత్మహత్యాయత్నం
- మహేశ్వరంలోని జ్యోతిరావుపూలె వసతి గృహంలో ఘటన



కె.సిద్ధు(ఫైల్)

మహేశ్వరం: హాస్టల్‌లో ఉండడం ఇష్టంలేని ఓ విద్యార్థి తరగతి గది మొదటి అంతస్తు భవనంపై నుంచి దూకి ఆత్మహత్యకు యత్నించాడు. ఈ సంఘటన మహేశ్వరం పోలీస్ స్టేషన్ పరిధిలోని మహాత్మా జ్యోతిరావు పూలె బీసీ వెల్ఫేర్ వసతి గృహంలో బుధవారం మధ్యాహ్నం చోటు చేసుకుంది. మహేశ్వరం సీఐ వెంకటేశ్వర్లు తెలిపిన ప్రకారం.. హైదరాబాద్‌లోని చంపాపేట్‌కు చెందిన కురుమేటి సిద్ధు(16) మహేశ్వరం గేటు వద్ద ఉన్న జ్యోతిరావు పూలె హాస్టల్‌లో ఇంటర్ సెకండియర్ (బైపీసీ) చదువుతున్నాడు. ఆగస్టు 14న తల్లిదండ్రులు విద్యార్థిని హాస్టల్లో చేర్పించారు. 35 రోజులకు గాను కేవలం 13 రోజులు మాత్రమే వసతి గృహంలో ఉన్నాడు. సెప్టెంబర్ 6న బంధువు చనిపోయారని ఇంటికి వెళ్లిన సిద్ధు బుధవారం మధ్యాహ్నం 12:15 గంటలకు సోదరుడితో కలిసి హాస్టల్‌కు వచ్చాడు. తరగతి గదికి వెళ్లకుండా 12:35 గంటలకు మొదటి అంతస్తు బాల్కనీ పైనుంచి దూకాడు. ఈ విషయాన్ని గమనించిన ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు, తోటి విద్యార్థులు వెంటనే అతన్ని ఆస్పత్రికి తరలించారు. అనంతరం కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. భవనం పైనుంచి దూకిన విద్యార్థి ముఖానికి తీవ్ర గాయలవడంతో పాటు పండ్లు ఊడిపోయాయి. ప్రస్తుతం ప్రాణాపాయం లేదని వైద్యులు తెలిపారు. బలవంతంగా హాస్టల్‌లో చేర్పించడంతోనే సిద్ధు అఘాయిత్యానికి పాల్పడ్డాడని ప్రిన్సిపాల్ సుబ్రహ్మణ్యం పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. కేసు దర్యాప్తులో ఉంది.

రిటైర్డ్ పోలీసు ఉద్యోగుల సంఘం నియామకం

నలహాదారుడిగా ఎంఏ.రహీం



సమావేశంలో పాల్గొన్న పోలీసు రిటైర్డ్ ఉద్యోగుల సంక్షేమ సంఘం సభ్యులు

సాక్షి,సిటీబ్యూరో: తెలంగాణ రాష్ట్ర పోలీసు రిటైర్డ్ ఉద్యోగుల సంక్షేమ సంఘం సలహాదారుడిగా రిటైర్డ్ పోలీస్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ మహమ్మద్ అబ్దుల్ రహీం ఏక్రగీవంగా ఎన్నికయ్యారు. బుధవారం హైదరాబాద్‌లో జరిగిన రాష్ట్ర స్థాయి సమావేశంలో ఈ మేరకు ఎన్నుకున్నారు. తనపై నమ్మకంతో ఏకగ్రీవంగా ఎన్నుకున్నందుకు అబ్దుల్ రహీం కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఐక్యతతో గొప్ప విజయాలు సాధించవచ్చని ఆకాంక్షించారు. సమవేశంలో రాష్ట్ర ఉపాధ్యక్షుడు అయోధ్య, ఆర్గనైజింగ్ కార్యదర్శి గాలి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

నష్ట పరిహారం అందించండి



హెచ్‌ఎండీఏ కమిషనర్‌కు వినతిపత్రాన్ని అందజేస్తున్న ఎమ్మెల్యే

షాద్‌నగర్: రోడ్డు విస్తరణ పనుల్లో భాగంగా ఆస్తులు కోల్పోయే వారికి నష్ట పరిహారాన్ని అందించాలని ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ హెచ్‌ఎండీఏ కమిషనర్ సర్ఫరాజ్ అహ్మద్‌ను కోరారు. ఈ మేరకు ఎమ్మెల్యే బుధవారం హైదరాబాద్‌లోని హెచ్‌ఎండీఏ కార్యాలయానికి వెళ్లి కమిషనర్‌కు వినతిపత్రాన్ని అందజేశారు. షాద్‌నగర్‌లో పాత జాతీయ రహదారి విస్తరణలో భూములు కోల్పోతున్న బాధితులకు నష్టపరిహారం అందించే విధంగా చర్యలు తీసుకోవాలని కోరారు.

వైద్యం వికటించి యువకుడి మృతి

ఆసుపత్రి ఎదుట బంధువుల ఆందోళన



ఆసుపత్రి ఎదుట ఆందోళన చేస్తున్న మృతుని బంధువులు

మేడిపల్లి: వైద్యం వికటించి ఓ యువకుడు మృతి చెందిన సంఘటన మేడిపల్లి పోలీస్ స్టేషన్ పరిధిలో బుధవారం చోటు చేసుకుంది. మృతుడి కుటుంబ సభ్యుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. మహబూబాబాద్‌కు చెందిన పంజాల అజయ్(32) తన తండ్రి కొన్ని నెలల క్రితం మృతి చెందడంతో అప్పటినుంచి డిప్రెషన్‌లో ఉంటున్నాడు. పీర్జాదిగూడలో ని తన చెల్లెలు ఇంటికి వచ్చిన అతను ఈ నెల 15న బాత్‌రూంలో కాలుజారి కింద పడ్డాడు. గాయాలు కావడంతో కుటుంబ సభ్యులు అతడిని జేపీ ఆసుపత్రిలో అడ్మిట్ చేశారు. తలకు ఆపరేషన్ చేశామని, రోగి కోలుకుంటున్నట్లు వైద్యులు చెప్పారు. అయితే బుధవారం ఉదయం అతను మృతి చెందాడని బంధువులు ఆగ్రహానికి లోనయ్యారు. వైద్యుల నిర్లక్ష్యంతోనే అజయ్ మృతి చెందాడని ఆరోపిస్తూ ఆసుపత్రి ఎదుట ఆందోళన చేపట్టారు.

వరమా.. కలవరమా?

ప్రతి నెలా ఆస్తిపన్ను వసూళ్లపై భిన్నాభిప్రాయాలు

కొంచెం మోదం...కొంచెం ఖేదం తప్పదంటున్న అధికారులు



సాక్షి, సిటీబ్యూరో: కరెంట్ బిల్లు, వాటర్‌బిల్లు మాదిరిగానే జీహెచ్‌ఎంసీ పరిధిలో ఆస్తిపన్నును సైతం నెలనెలా వసూలు చేయాలనే ప్రభుత్వ నిర్ణయంపై అటు జీహెచ్‌ఎంసీ వర్గాల్లో, ఇటు ప్రజల్లో భిన్నాభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. సాధారణ, దిగువ మధ్యతరగతి ప్రజలకు నెలనెలా ఆస్తిపన్ను చెల్లింపు ఊరట కలిగించనున్నప్పటికీ, నిర్ణీత వ్యవధిలో చెల్లించని పక్షంలో జీహెచ్‌ఎంసీ నుంచి అందాల్సిన సేవలు కానీ..వాటర్, కరెంట్ వంటి సేవలు కానీ నిలిపివేస్తారేమోననే సందేహాలు చాలామందిలో ఉన్నాయి. జీహెచ్‌ఎంసీ ఆస్తిపన్నుతోపాటు ఒక భవనానికి సంబంధించిన వాటర్, కరెంట్ బిల్లులు, ఇతరత్రా వివరాలన్నీ సంబంధిత అధికారులకు తెలుస్తాయి. దాంతో ఏ ఒక్క బిల్లు చెల్లించకపోయినా ఇబ్బందులెదురవుతాయేననే అనుమానం వారిని వెంటాడుతోంది. నిర్ణీత వ్యవధిలో చెల్లించలేని పక్షంలో ఇబ్బందులెదురవుతాయేమోననే సంశయాలున్నాయి.

భిన్న వాదనలు..సూచనలు

- పైన చెప్పినవి ప్రజల వైపునుంచి వ్యక్తమవుతున్న అనుమానాలు కాగా, నెలనెలా ఆస్తిపన్ను చెల్లింపుల వల్ల జీహెచ్‌ఎంసీకి ప్రతినెలా కచ్చితంగా ఎంత ఆదాయం రాగలదో అంచనా ఉంటుందని, అందుకనుగుణంగా నిధులు ఖర్చు చేయవచ్చునని, ఇది జీహెచ్‌ఎంసీకి ఎంతో ఉపయుక్తమని కొందరు అధికారులు పేర్కొన్నారు.
- జీహెచ్‌ఎంసీకి ఏడాదికి దాదాపు రూ. 2వేల కోట్లు ఆస్తిపన్ను ద్వారా ఖజానాకు చేరుతోంది. అయితే ఆర్థిక సంవత్సరం ఆరంభంలో ఎర్లీబర్డ్ రాయితీ ఉండే ఏప్రిల్ నెలలో, ఆర్థిక సంవత్సరం ముగిసే ఫిబ్రవరి, మార్చి నెలల్లో అధిక మొత్తంలో వసూలవుతోంది. ఎర్లీబర్డ్ ద్వారా ఏప్రిల్ ఒక్క నెలలోనే గత ఆర్థిక సంవత్సరం రూ. 827 కోట్లు వసూలైంది. ఒకేసారి అంతపెద్ద మొత్తం వస్తే ప్రాజెక్టుల పనులకు, పెండింగ్ బిల్లుల చెల్లింపులకు ఆసరాగా ఉంటుందంటున్న వారూ అన్నారు.
- అలాగే ఆర్థిక సంవత్సరం చివరి రెండు మాసాల్లోనూ అధికమొత్తం వసూళ్ల వల్ల ఏవైనా పనులకు వీలుంటుందని వారు చెబుతున్నారు. దాని కంటే నెలనెలా స్థిరాదాయమే మంచిదనే వారే ఎక్కువగా ఉన్నారు. ప్రతినెలా వచ్చే ఆస్తిపన్ను తో సిబ్బంది జీతాల చెల్లింపులకు కటకట ఉండదని, ఇప్పటి మాదిరిగా నెల వస్తోందంటే జడుసుకోవాల్సిన పరిస్థితి ఉండదని వారు చెబుతున్నారు.
- నెలనెలా వసూలైతే సగటున నెలకు రూ.150 కోట్ల వరకు ఆస్తిపన్ను రూపేణా వచ్చే అవకాశముంది. జీహెచ్‌ఎంసీ సిబ్బంది జీతభత్యాలకు అది సరిపోతుంది. అయితే నిర్వహణ పనులు కానీ, ప్రాజెక్టుల పనులు కానీ చేయడానికి నిధులుండవని, కనీస నిర్వహణ పనులు కూడా చేయలేని పరిస్థితి ఎదురవుతుందని అంటున్నారు.

బకాయిలు పెరగవు..

నెలనెలా ఆస్తిపన్ను వసూళ్ల వల్ల బకాయిలు పెరగకుండా ఉంటాయని, అది జీహెచ్‌ఎంసీకి ఎంతో ప్రయోజనమని చెబుతున్న అధికారులు కూడా ఉన్నారు. పేరుకుపోయిన బకాయిలు భారీ మొత్తంలో కాగితాల్లో కనిపించడమే తప్ప అవి వసూలు కావని, ముమ్మందైనా బకాయిలంటూ పేరుకుపోకుండా ఉంటే అది బల్దియాకు లాభమే అంటున్నారు. ప్రజల్లో సైతం నెలనెలా చెల్లింపుల వల్ల వెసులుబాటు ఉంటుందంటున్న వారితోపాటు నెలనెలా కట్టే బదులు ఒకేసారి చెల్లిస్తే ఆర్నెళ్లు, ఏడాది వరకు తిరిగి ఆలోచించాల్సిన పని ఉండదంటున్న వారూ ఉన్నారు. ఇలా ఎవరి కోణంలో వారు ఆలోచిస్తున్నారు.

పనులు చేయకుంటే ప్రజలు ఊరుకోరు..

నెలనెలా ఆస్తిపన్ను వసూలు చేస్తే ప్రజల నుంచి కొంత ఒత్తిడి ఎదురయ్యే అవకాశం కూడా ఉందంటున్నారు. జీహెచ్‌ఎంసీ కల్పించాల్సిన ఏ సదుపాయం కల్పించకపోయినా ప్రజల ఆగ్రహానికి గురికావాల్సి వస్తుందని, దాన్ని దృష్టిలో ఉంచుకొని రోడ్లు, నాలాలతోసహా అన్ని పనులూ సకాలంలో చేయకతప్పదంటున్నారు. పనులు చేసేందుకు టౌన్‌ప్లానింగ్, అడ్వర్టయిజ్‌మెంట్స్, ట్రేడ్ లైసెన్సులు, ఎస్టేట్స్ అద్దెలు, తదితర మార్గాల ద్వారా వచ్చే నిధుల్ని వినియోగించుకోవచ్చునని వారు అభిప్రాయాలు వ్యక్తం చేశారు. జీతాల కటకట సమస్య మాత్రం తీరిపోతుందని, అది జీహెచ్‌ఎంసీకి ఎంతో ఉపశమనమని అంటున్నారు. ఇలా ఎవరి అభిప్రాయాలు వారు వ్యక్తపరుస్తున్నారు.

మున్సిపల్ కమిషనర్‌పై ఫిర్యాదు

షాద్‌నగర్: మున్సిపల్ కమిషనర్ ప్రొటోకాల్ పాటించడం లేదని, తమను అవమానిస్తున్నారని ఆరోపిస్తూ షాద్‌నగర్ మున్సిపల్ వైస్ చైర్మన్ ఎంఎస్ నటరాజన్ జిల్లా అదనపు కలెక్టర్‌కు బుధవారం ఫిర్యాదు చేశారు. డబుల్ బెడ్ రూం ఇళ్ల పరిశీలనకు కలెక్టర్ వస్తున్న విషయాన్ని కమిషనర్ తమకు తెలపలేదన్నారు. అదేవిధంగా మున్సిపాలిటీని ప్రభావితం చేసే ప్రధాన నిర్ణయాలు, సంక్షేమం గురించి సమాచారం అందించడం లేదన్నారు. గణేశ్ నిమజ్జన కార్యక్రమంతో పాటు, ఇటీవల జరిగిన కార్యక్రమాల గురించి కింద స్థాయి ఉద్యోగుల ద్వారా సమాచారం అందిందని తెలిపారు. ఇవి ప్రొటోకాల్ ఉల్లంఘన కిందికే వస్తుందన్నారు. ఇలాంటి సమస్యలు పునరావృతం కాకుండా కమిషనర్‌పై తగిన చర్యలు తీసుకోవాలని ఫిర్యాదులో పేర్కొన్నారు.

బస్సు ఢీకొని వ్యక్తి మృతి

శంకర్‌పల్లి: ఆర్టీసీ బస్సు ఢీకొని ఓ గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందిన సంఘటన బుధవారం సాయంత్రం శంకర్‌పల్లి పీఎస్ పరిధిలో చోటు చేసుకుంది. సీఐ హబీబుల్లాఖాన్ తెలిపిన వివరాల ప్రకారం.. మెహదీపట్నం డిపోకి చెందిన బస్సు హైదరాబాద్ నుంచి శంకర్‌పల్లి వైపు వస్తుంది. శంకర్‌పల్లి మున్సిపాలిటీ పరిధిలోని బుల్కాపూర్ రాఘవేంద్రస్వామి ఆలయం సమీపంలో ఓ గుర్తు తెలియని వ్యక్తి(45) రోడ్డు దాటుతుండగా.. బస్సు ఢీ కొట్టింది. ఈ ప్రమాదంలో వ్యక్తి తలకి బలమైన రక్త గాయాలై అక్కడికక్కడే మృతి చెందాడు. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం చేవెళ్ల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. కేసు నమోదు చేసుకొని, దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

వచ్చాడు.. పొడిచాడు.. పారిపోయాడు

- ఇద్దరు వ్యక్తులపై గుర్తుతెలియని వ్యక్తి దాడి
- మేడ్చల్ మున్సిపాలిటీ పరిధి కిష్టాపూర్‌లో ఘటన
- ఒకరి మెడపై, మరొకరి ముఖంపై కత్తితో దాడి
- డబ్బుల వ్యవహారమే కారణంగా అనుమానం



పవన్

మేడ్చల్‌రూరల్: ఇద్దరు వ్యక్తులు వ్యాపార విషయాలు మాట్లాడుకుంటుండగా అక్కడికి వచ్చిన గుర్తుతెలియని వ్యక్తి వారిపై కత్తితో దాడికి పాల్పడిన సంఘటన మేడ్చల్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని కిష్టాపూర్‌లో చోటు చేసుకుంది. ఇన్‌స్పెక్టర్ సత్యనారాయణ కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. బిహార్‌కు చెందిన రంజిత్ తన స్నేహితులు సంతోష్, పవన్‌కుమార్, విక్రమ్‌తో కలిసి కిష్టాపూర్‌లోని సాయినగర్ కాలనీలో ఓ ఇంటిని అద్దెకు తీసుకుని సీడ్స్ వ్యాపారం నిర్వహిస్తున్నాడు. వీరు కిష్టాపూర్‌లోని ఓ సీడ్ కంపెనీ నుంచి సీడ్స్ కొనుగోలు చేసి వాటిని బిహార్‌లో విక్రయించేవారు. ఈ క్రమంలో మంగళవారం విత్తనాలు కొనుగోలు చేసిన వారు రాత్రి గదిలో బసచేసి బుధవారం ఉదయం బిహార్ వెళ్లాలని నిర్ణయించుకున్నారు. అర్ధరాత్రి నలుగురు కలిసి బాల్కానిలో నిలుచుని వ్యాపార విషయాలు మాట్లాడుకుంటుండగా అక్కడికి వచ్చిన గుర్తుతెలియని వ్యక్తి ఒక్కసారిగా సంతోష్, పవన్ లపై కత్తితో దాడికి పాల్పడి పరారయ్యాడు. దీంతో సంతోష్ మెడకు, పవన్ ముఖంపై తీవ్రగాయాలయ్యాయి. వారిని చికిత్స నిమిత్తం గాంధీ ఆస్పత్రికి తరలించారు. సంతోష్ పరిస్థితి విషమంగా ఉండగా పవన్‌కు స్వల్ప గాయాలైనట్లు పోలీసులు తెలిపారు.

డబ్బుల వ్యవహారమే దాడికి కారణమా?

డబ్బుల విషయమై తగాదాల కారణంగానే గుర్తు తెలియని వ్యక్తి దాడికి పాల్పడినట్లు పోలీసులు ప్రాథమికంగా నిర్ధారించారు. సంతోష్, పవన్‌లతో ఓ వ్యక్తికి డబ్బుల వ్యవహారంలో విభేదాలు నెలకొనడంతో అతడే వ్యక్తి దాడికి పాల్పడి ఉండవచ్చని అనుమానిస్తున్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకున్న పోలీసులు నిందితుడి కోసం గాలింపు చేపట్టారు.

చెరువులో పడి వ్యక్తి దుర్మరణం

- దశ దినకర్మ పూజా సామగ్రిని నీళ్లలో వదులుతుండగా ప్రమాదం
- చెన్నారంలో విషాద ఛాయలు



లక్ష్మప్ప (ఫైల్)

యాలాల: చెరువులో పడి వ్యక్తి మృతిచెందిన ఘటన యాలాల మండలం చెన్నారంలో మంగళవారం రాత్రి చోటుచేసుకుంది. ఎస్ఐ శంకర్, స్థానికుల వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన కొనగేరి లక్ష్మప్ప(32) సమీప బంధువు పది రోజుల క్రితం గుండెపోటుతో మృతి చెందాడు. దశ దినకర్మలో భాగంగా మంగళవారం ఇంటి వద్ద పూజా క్రతువులు నిర్వహించారు. అనంతరం ఇందుకు సంబంధించిన సామగ్రిని చెరువులో వదిలేందుకు వెళ్లిన లక్ష్మప్ప కాలు జారి చెరువులో పడ్డాడు. ఈ సమయంలో అతనితో ఉన్న మరో బాలుడు పరుగున వెళ్లి ఇంటి వద్ద సమాచారం అందించాడు. బంధువులు వచ్చి లక్ష్మప్పను బయటకు తీయగా.. అప్పటికే మృతిచెందాడు. ఈ విషయమై యాలాల పోలీసులకు ఫిర్యాదు చేయగా.. మృతదేహాన్ని తాండూరు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. లక్ష్మప్పకు భార్యతో పాటు ఇద్దరు పిల్లలు ఉన్నారు. కాంగ్రెస్ బీ బ్లాక్ అధ్యక్షుడు అనిల్‌కుమార్ బాధిత కుటుంబానికి ఆర్థిక సాయం అందించారు. మాజీ సర్పంచ్ మల్లయ్య, సాయిలు, నాయకులు దశరథ్‌రెడ్డి, వడ్ల పెద్ద నర్సింహులుచారి తదితరుల బాధిత కుటుంబాన్ని పరామర్శించి, ధైర్యం చెప్పారు.

'పట్నం'లో కలపాలి

సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు బ్రహ్మయ్య



జిల్లా రెవెన్యూ అధికారికి వినతిపత్రం అందజేస్తున్న భవన నిర్మాణ కార్మికులు

ఇబ్రహీంపట్నం రూరల్: మాడ్గుల మండలంలోని కార్మిక శాఖ కార్యాలయాన్ని షాద్‌నగర్ పరిధిలోకి కాకుండా ఇబ్రహీంపట్నం పరిధిలోకి వచ్చేలా చూడాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు పెండ్యాల బ్రహ్మయ్య ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. భవన నిర్మాణ కార్మికులతో కలిసి సమస్యలు పరిష్కరించాలని కోరుతూ బుధవారం జిల్లా కలెక్టర్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా బ్రహ్మయ్య విచ్చేసి మాట్లాడుతూ.. భవన నిర్మాణ కార్మికుల సంక్షేమ పథకాలను ఇన్సూరెన్స్ కంపెనీలకు ఇవ్వొద్దన్నారు. ప్రభుత్వమే బోర్డు ద్వారా సంక్షేమ పథకాలను అమలు చేయాలన్నారు. పీఎఫ్, ఈఎస్ఐ సౌకర్యాలు కల్పించాలని కోరారు. అనంతరం జిల్లా రెవెన్యూ అధికారి సంగీతకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో కుర్మయ్య, రామ్మోహన్, రాందాస్, నర్సింహ, ముస్తాఫా, జంగయ్య, యాదయ్య, స్వామి, సీహెచ్ నర్సింహ తదితరులు పాల్గొన్నారు.

బాలికపై లైంగికదాడి

నిందితుడి రిమాండ్

మేడిపల్లి: ఓ బాలికపై లైంగిక దాడికి పాల్పడిన సంఘటన మేడిపల్లి పోలీస్ స్టేషన్ పరిధిలో బుధవారం వెలుగులోకి వచ్చింది. పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి..ఓ బాలిక బోడుప్పల్‌లోని బంధువుల ఇంట్లో ఉంటూ 8వ తరగతి చదువుతోంది. కేశవరెడ్డి అనే వ్యక్తి ఆమెకు మాయ మాటలు చెప్పి తన గదిలోకి తీసుకెళ్లి లైంగికదాడికి పాల్పడ్డాడు. బాధితురాలు ఈ విషయాన్ని బంధువులకు చెప్పడంతో వారు మేడిపల్లి పోలీసులకు ఫిర్యాదు చేశారు. నిందితుడిపై పోక్సో కేసు నమోదు చేసిన పోలీసులు అతడిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు తెలిపారు.

కూతురిపై అఘాయిత్యం కేసులో తండ్రికి జైలు

మల్కాజిగిరి: కుమార్తెపై లైంగిక దాడికి పాల్పడిన కేసులో నిందితుడికి ఐదేళ్ల జైలు శిక్ష విధిస్తూ న్యాయస్థానం బుధవారం తీర్పు చెప్పింది. ఇన్‌స్పెక్టర్ సత్యనారాయణ కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి..మల్కాజిగిరికి ప్రాంతానికి చెందిన సురుగు రాములు ప్లంబర్‌గా పని చేసేవాడు. 2019 ఏప్రిల్‌లో మద్యం మత్తులో తన కుమార్తెపై లైంగికదాడికి పాల్పడ్డాడు. బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు నిందితుడిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. కేసుపై విచారణ చేపట్టిన పోక్సో స్పెషల్ ట్రాక్ జడ్జి నిందితుడికి ఏడేళ్ల జైలు శిక్ష, రూ.5 వేలు జరిమానా చెల్లించాలని తీర్పు చెప్పారు.

ప్రాణం తీసిన ఈత సరదా

మేడ్చల్‌రూరల్: మద్యం మత్తులో సరదాగా చెరువులో ఈత కొట్టేందుకు వెళ్లిన ఇద్దరు వ్యక్తులు నీటిలో మునిగి మృత్యువాత పడిన సంఘటన మేడ్చల్ పోలీస్‌స్టేషన్ పరిధి అర్కల్‌గూడలో చోటు చేసుకుంది. పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. వెస్ట్ బెంగాల్‌కు చెందిన నెల్సన్(35), దీపు (29)తో పాటు మరో వ్యక్తి మునీరాబాద్ గ్రామంలో నివాసం ఉంటూ స్థానిక క్రికెట్ గ్రౌండ్‌లో పనిచేస్తున్నారు. బుధవారం ఉదయం వారు ముగ్గురు కలిసి పార్టీ చేసుకున్నారు. అనంతరం మద్యం మత్తులో ఈత కొట్టేందుకు అర్కల్‌గూడ గ్రామ పరిధిలోని కోమటి కుంట చెరువుకు వెళ్లారు. నెల్సన్, దీపు నీటిలో దిగగా మరో వ్యక్తి గట్టున నిలుచుని వారిని సెల్‌ఫోన్‌లో వీడియో తీస్తున్నాడు. ప్రమాదవశాత్తు వారిలో ఒకరు నీటిలో మునిగిపోతుండగా కాపాడేందుకు ప్రయత్నించిన మరో వ్యక్తి సైతం నీటిలో మునిగి గల్లంతయ్యాడు. ఒడ్డున ఉన్న వ్యక్తి స్థానికులకు తెలుపడంతో వారు మేడ్చల్ పోలీసులకు సమాచారం అందించారు. సంఘటనా స్థలికి చేరుకున్న పోలీసులు గత ఈతగాళ్ల సాయంతో గాలింపు చేపట్టగా నెల్సన్ మృతదేహం లభ్యమైంది. అప్పటికే చీకటి పడడంతో గాలింపు చర్యలు నిలిపివేశారు. గురువారం ఉదయం దీపు కోసం గాలింపు చేపట్టనున్నట్లు పోలీసులు తెలిపారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకున్న పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గాంధీ మార్చురీకి తరలించారు.

ఆగి ఉన్న లారీని ఢీ కొన్న కారు

మైలార్‌దేవ్‌పల్లి: ఆగి ఉన్న లారీని కారు ఢీకొట్టిన ఘటన రాజేంద్రనగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. బుద్వేల్ సమీపంలోని బెంగుళూర్ జాతీయ రహదారిపై బుధవారం ఆగి ఉన్న లారీని బెలోనో కారు అతివేగంగా ఢీకొట్టింది. ఈ ఘటనలో డ్రైవింగ్ చేస్తున్న వక్తికి తీవ్రంగా గాయాలు అయ్యాయి. కారులోని బెలున్ తెరుచుకోవడంతో డ్రైవింగ్ చేస్తున్న వ్యక్తికి ప్రాణాపాయం తప్పింది. ఈ ప్రమాదంలో కారు ముందు భాగం నుజ్జు నుజ్జు అయ్యింది. స్థానికుల సమాచారం మేరకు పోలీసులు ఘటన స్థలానికి చేరుకుని గాయపడిన వ్యక్తిని ఆసుపత్రికి తరలించారు. మితిమీరిన వేగమే ప్రమాదానికి కారణమైందని పోలీసులు తెలిపారు. బాధితుడి నుంచి ఎలాంటి ఫిర్యాదు అందలేదని తెలిపారు.

పిల్లలు లేరని మనస్తాపం

ఉరేసుకొని వివాహిత ఆత్మహత్య

మోమిన్‌పేట: పిల్లలు లేరని మనస్తాపం చెందిన ఓ మహిళ ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన మోమిన్‌పేటలో బుధవారం చోటు చేసుకొంది. ఎస్ఐ అరవింద్ తెలిపిన వివరాల ప్రకారం.. మండల కేంద్రానికి చెందిన వడ్డే మానస(26)కు ఎనిమిదేళ్ల క్రితం ప్రవీణ్‌తో వివాహం చేశారు. వీరికి సంతానం లేదు. దీంతో రెండేళ్ల క్రితం ఆమె భర్తతో గొడవపడి బూర్గుపల్లిలో తన అక్క నర్సమ్మతో ఉంటుంది. పిల్లలు లేరనే క్రమంలో మానస మద్యం మత్తుకు బానిసైంది. మంగళవారం రాత్రి ఆమె ఇంటి నుంచి బయటకు వెళ్లింది. మరుసటి రోజు ఉదయం గ్రామ సమీపంలోని రాచన్న దేవాలయంలో రేకుల షెడ్డుకు ఉరి వేసుకొని ఆమె ఆత్మహత్యకు పాల్పడింది. గమనించిన గ్రామస్తులు పోలీసులకు సమాచారం ఇచ్చారు. మృతురాలి అక్క నర్సమ్మ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

మారువేషాలతో చోరీలు



వివరాలు వెల్లడిస్తున్న డీసీపీ చింతమనేని శ్రీనివాస్

- ఘరానా దొంగల ముఠా అరెస్ట్
- 60తులాల బంగారు నగలు
- బైక్ స్వాధీనం

రాజేంద్రనగర్: మారు వేషాలతో దొంగతనాలకు పాల్పడుతున్న ఘరానా ముఠాను రాజేంద్రనగర్ పోలీసులు, సీసీఎస్ పోలీసులు సంయుక్తంగా పట్టుకున్నారు. వీరి నుంచి బైక్, 60తులాల బంగారు ఆభరణాలు స్వాధీనం చేసుకున్నారు. బుధవారం సాయంత్రం డీసీపీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో డీసీపీ చింతమనేని శ్రీనివాస్ వివరాలు వెల్లడించారు. మాట్లాడుతూ.. నంద్యాల ప్రాంతానికి చెందిన జి సుధాకర్(33) బతుకుదెరువు నిమిత్తం నగరానికి వలస వచ్చాడు. శ్రీనగర్ కాలనీ, మెహదీపట్నం ప్రాంతాల్లో ఆటో నడుపుతూ జీవనం సాగించేవాడు. జల్సాలకు అలవాటు పడిన అతను చోరీలకు పాల్పడుతున్నాడు. అతడిపై పలు పోలీస్‌స్టేషన్ల పరిధిలో 50కి పైగా కేసులు ఉన్నట్లు తెలిపారు. బట్టతల ఉండడంతో విగ్గును ఉపయోగించే అతను మహిళల వేషధారణలో దొంగతనాలకు పాల్పడేవాడు. గతంలో ఆసిఫ్‌నగర్ పోలీసులు అతడిని అరెస్ట్ చేసి పీడీ యాక్ట్‌పై జైలుకు పంపారు. జైలులో అతడికి పాత నేరస్తుడు సరూర్‌నగర్ ప్రాంతానికి చెందిన బండారి సాంసంగ్, కొత్తూరుకు చెందిన శనిదేవ్, పంజాబ్‌కు చెందిన అమృత్ సింగ్‌తో పరిచయం ఏర్పడింది. ఐదు నెలల క్రితం జైలు నుంచి బయటికి వచ్చిన సుధాకర్ ముఠాను ఏర్పాటు చేశాడు. రాజేంద్రనగర్, పేట్ బషీరాబాద్ పోలీస్ స్టేషన్లలో రెండు, రాయదుర్గంలో ఒక దొంగతనాలకు పాల్పడ్డాడు. చోరీ సొత్తును తన సోదరుడు సురేష్ అప్పగించేవాడు. అతను నగలను విక్రయించి, లేదా తాకట్టు పెట్టి నగదు రూపంలోకి మార్చేవాడు. ఈ ముఠా రాజేంద్రనగర్ స్టేషన్ పరిధిలో లక్ష్మీనగర్ ప్రాంతంలో ఓ రియల్‌ఎస్టేట్ వ్యాపారి ఇంట్లో 60 తులాల బంగారాన్ని ఎత్తుకెళ్లింది. కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టిన పోలీసులు సీసీ కెమెరా ఫుటేజీ ఆధారంగా బండ్లగూడ ప్రాంతంలో డీసీఎంలో వచ్చిన నిందితులు ఓ ద్విచక్రవాహనాన్ని దొంగిలించి తీసుకెళ్తుండగా వారిని అదుపులోకి తీసుకున్నారు. వారిని విచారించగా ఐదు చోరీలకు సంబంధించి వివరాలు వెల్లడించారు. నిందితులను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. ఈ కేసులో ప్రతిభ చూపిన పోలీసులకు డీసీపీ రివార్డును అందజేశారు.

శాతం చెరువును పరిశీలించిన ఎమ్మెల్యే

గోల్కొండ: శాతంచెరువులో వర్షపు నీరు ప్రమాదస్థాయి కంటే ఎక్కువగా ఉందని ఎమ్మెల్యే కార్వాన్ కౌసర్‌మోహియుద్దీన్ అన్నారు. బుధవారం ఆయన బల్దియా, ఇరిగేషన్ శాఖ అధికారులతో కలిసి గోల్కొండ నయాఖీలాలోని శాతం చెరువును సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన అక్కడ జరుగుతున్న తూము పనులను పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ.. ఈ వర్షాకాలంలో భారీ వర్షాలకు శాతం చెరువు బ్యాక్ వాటర్ నదీమ్ కాలనీ లోతట్టు ప్రాంతాల వారిని భయాందోళనకు గురి చేస్తుందన్నారు. గత వర్షాకాలం నుంచి ఇప్పటి వరకు తాను శాతం చెరువును ఎన్నోసార్లు సందర్శించానని, తూము పనులను త్వరగా పూర్తి చేయాలని ప్రతిసారి అధికారులకు తెలుపుతున్నానన్నారు. అయితే తూము పనులను అధికారులు ప్రణాళికబద్ధంగా చేయకపోవడం వల్లనే చెరువు లోని నీరు త్వరగా బయటకు వెళ్లడం లేదని ఆయన పేర్కొన్నారు. బల్దియా ఇరిగేషన్ అధికారి జ్యోతి, డిప్యూటీ ఈఈ రామకృష్ణ, టోలిచౌకి డివిజన్ మజ్లిస్ అధ్యక్షులు హారూన్‌ఫరాన్ పాల్గొన్నారు.